


హంద్రీ-నీవా కాలువ విషయంలో ముఖ్యమంత్రి జగన్ పరువు నిలపడానికి అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. సీఎం ప్రారంభించిన కుప్పం బ్రాంచి కాలువలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని, ఒకదానివెంట మరో చెరువు నిండినట్లు చెబుతున్నారు. ఈ మేరకు నిజ నిర్ధారణ పేరుతో అధికార యంత్రాంగం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నిజంగానే అధికారులు చెబుతున్న నిజనిర్ధారణ నిజమేనా? కృష్ణమ్మ జలాలు పరుగులు పెట్టి చెరువులు చేరిపోతున్నాయా? కచ్చితంగా ఈ ప్రశ్నలకు లేదనే సమాధానమే చెప్పుకోవచ్చు. అధికారుల ప్రకటన, దానికి విరుద్ధంగా ఉన్న వాస్తవాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



● మసిపూసి మారేడుకాయ

కృష్ణమ్మా.. పరుగులు ఎక్కడమ్మా!

- కుప్పం/రామకుప్పం

◆ ప్రవాహం తగ్గడంతో ప్రారంభమైన చోటే మద్దికుంటకు నీటి మళ్లింపు ◆ ఎండిన మిగిలిన కాలువ

◆ నిజ నిర్ధారణ అంటూ అధికారుల అబద్ధాలు

చిట్టచివరి ఆయకట్టు ఏది?

హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా ప్రాజెక్ట్ చిట్టచివరి ఆయకట్టుదాకా నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తమ నిజనిర్ధారణ ప్రకటనలో పేర్కొన్నారు. రామకుప్పం మండలం వర్దికుప్పం వద్ద నియోజకవర్గంలో ప్రవేశించినప్పటినుంచి గమ్యస్థానమైన పరమసముద్రం చెరువు దాకా హంద్రీ-నీవా కాలువ పొడవు 139 కిలోమీటర్లు. చిట్టచివరి ఆయకట్టుకు నీళ్లు అందించడం అంటే, పరమసముద్రం నింపడం ద్వారా సమీపంలోని చేలకు సాగునీరు అందేలా చేయడం. కానీ, కాలువలో నీటి ప్రవాహం లేనందున దాదాపు ప్రారంభ ప్రదేశంలోనే అడ్డుగా కట్టకట్టి మద్దికుంటకు నీటిని మళ్లిస్తున్నారు. మరి చిట్టచివరి ఆయకట్టుకు నీరందించడం ఏమిటో అధికారులే చెప్పాలి. వారి లెక్కల ప్రకారం మద్దికుంట చెరువు కింద ఉన్న భూములే చిట్టచివరి ఆయకట్టు అయితే చెప్పేందుకేమీ లేదు.

హంద్రీ-నీవా కాలువ గమ్యస్థానమైన పరమసముద్రం చెరువు దుస్థితి



ఇదీ అధికారుల ప్రకటన

'హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలను మద్దికుంట చెరువుకు, అక్కడినుంచి నాగసముద్రం, మణీంద్రం చెరువులకు మళ్లించడం జరుగుచున్నది. ఇప్పటికే మద్దికుంట నిండిపోయింది. శాంతిపురం మండలం వెంకటేశ్వరపురం గ్రామం వద్ద చిట్టివానికుంట చెరువును కూడా నింపడం జరిగింది. కృష్ణా నదిలో నీటి లభ్యత తక్కువ. శ్రీశైలం రిజర్వాయర్‌లో కనీస నీటి నిల్వలు ఉన్నప్పటికీ ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు సుమారు 676 కిలోమీటర్ల దూరం నీటిని తీసుకొచ్చి చిట్టచివరి ఆయకట్టుకు తరలించాము' అంటూ హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం (రెండవ దశ) అధికారి అనంత వెంకటరెడ్డి పేరుతో విడుదలైన ప్రకటన సారాంశమిదీ.

ఇవీ వాస్తవాలు



ముప్పావు వంతు నిండిన మద్దికుంట చెరువు



నీళ్లులేక బావురుమంటున్న నాగసముద్రం చెరువు



ఎండిపోతున్న మణీంద్రం చెరువు

రామకుప్పం మండలం రాజుపేట వద్ద సీఎం జగన్ ప్రారంభించేందుకు పెట్టిన గేటుకు ఎగువన హంద్రీ-నీవా కాలువలో నీటిమట్టం కేవలం ఒకటిన్నర, రెండు అడుగులు మాత్రమే ఉంది. కానీ, దానికి ఈవల మాత్రం కాలువ లోతు పెరగడం వల్ల నీటి మట్టం మూడున్నర అడుగుల మేరకు చేరింది. ఈ గేటునుంచి ఇవతలివైపు సుమారు కిలోమీటరు దూరంలో కట్ట కట్టేయడం వల్ల ఈ మాత్రపు నీటిమట్టమైనా సాధ్యమైంది. ఈ నిల్వ చేసిన ప్రాంతంనుంచి అధికారులు చెప్పినట్లు 70.100 కిలోమీటరు వద్ద గల కాలువ తూము ద్వారా సుమారు 50-60 అడుగుల దూరంలోని మద్దికుంట చెరువుకు నీళ్లు నెమ్మదిగా చేరుతున్నాయి. బుధవారం సాయంత్రానికి ముప్పావు వంతు చెరువు నిండిన మాట నిజమే. కృష్ణా జలాల విషయంలో వస్తున్న విమర్శలపై ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎంతకష్టమైనా మద్దికుంట చెరువును నింపి, దాని దిగవగల నాగసముద్రం చెరువుకు నీళ్లు ఇవ్వాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ తర్వాత మణీంద్రం చెరువుకు నీళ్లు వదలాలి. ఇవి ఎప్పుడు నిండతాయనేది అధికారులే చెప్పలేక పోతున్నారు. కాగా, మద్దికుంట చెరువుకు నీళ్లు మళ్లించడంతో గుండిశెట్టిపల్లె వైపు కాలువలో చుక్క నీళ్లు కనిపించడంలేదు.

గేటు తొలగించలేదు

● జల వనరులశాఖ వివరణ

కుప్పం: హంద్రీనీవా కాలువలో రాజుపేట వద్ద నీటి విడుదలకు అవసరమైన గేటును తొలగించలేదని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మీడియాలో వచ్చిన వార్తలకు బుధవారం వివరణ ఇస్తూ ప్రకటన విడుదల చేసింది. క్రాస్ రెగ్యులేటర్ వద్ద బటన్, వేదిక ఏర్పాట్లను మాత్రమే ముఖ్యమంత్రి పర్యటన అనంతరం తొలగించినట్లు పేర్కొంది అలాగే గేటుకు అటు ఇటు నీళ్లు నిలిచిపోలేదని ఇప్పటికీ కాలువ ద్వారా కింది ప్రాంతానికి ప్రవహిస్తున్నాయని పేర్కొంది గుండి శెట్టి పల్లె వద్ద కాలువ ఎండిపోలేదని స్థానిక నేతల కోరిక మేరకు కొంత భాగము 84వ కిలోమీటర్ వద్ద విడుదల చేశామని తెలిపింది. అలాగే శ్రీశైలం జలాశయం నుంచి మాల్యాల వద్ద గల ఎత్తిపోతల ద్వారా బుధవారం నాటికి కూడా 960 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని చెప్పింది. దాని ద్వారా 600 క్యూసెక్కుల నీరు జీడిపల్లి జలాశయానికి చేరుతున్నదని తెలిపింది. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు ఉపకాలువకు 8 చోట్ల ఎత్తిపోతల ద్వారా కుప్పం ఉపకాల్వకు నిరంతరాయంగా నీరు సరఫరా చేస్తున్నామని పేర్కొంది.



మద్దికుంట చెరువుకు నీటి మళ్లింపుతో ఇవతల ఎండిపోతున్న కాలువ

చిట్టివానికుంటను ఎట్ల నింపారో?

శాంతిపురం మండలం చిట్టివానికుంట నింపడం జరిగిందని అధికారులు ప్రకటనలో పేర్కొన్నారు. ఆ ప్రకటనలో చెప్పిన ప్రకారం ఈ కుంటలాంటి చెరువు 75.750 కిలోమీటరు వద్ద ఉంది. దానికి ముందుగానే 70.100 కిలోమీటరు వద్ద కాలువ మధ్యలో నీటి ప్రవాహాన్ని ఆపి కట్ట కట్టేసి, మద్దికుంటకు నీళ్లు మళ్లిస్తున్నారు. ఆ తర్వాత కాలువలో చుక్క నీళ్లు లేవు. మరి లేని నీళ్లు అది కూడా ఐదారు కిలోమీటర్ల దూరం ప్రయాణించి చిట్టివానికుంటకు ఎలా చేరాయో అధికారులే చెప్పాలి.

కాకుంటే, సీఎం పర్యటన కోసం రోజుల తరబడి గేటువేసి నిలిపిన నీళ్లు.. ప్రారంభోత్సవం రోజైన 26వ తేదీన గుండిశెట్టిపల్లె దాకా ప్రవహించాయి. వీటిలో కొద్దిపాటి జలాన్ని ఆ పక్కనే గల చిట్టివానికుంటకు విడిచిపెట్టారు. దీన్నే కుంట మొత్తం నిండిపోవడంగా అధికారులు చెప్పుకొంటున్నారు.

కుప్పం బ్రాంచి కెనాల్ ఉద్దేశమిదీ

శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను తీసుకొచ్చి కుప్పం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం. నియోజకవర్గంలో కాలువ వెళ్లే 139 కిలోమీటర్ల పొడవునా 54 చెరువులకు నీరందిస్తూ పరమసముద్రం చెరువుకు నీళ్లు చేరితేనే ప్రాజెక్ట్ సఫలమైనట్లు. దాన్ని వంద శాతం పూర్తి చేసినట్లు, ఎన్నికల కోసం హడావుడిగా సీఎం జగన్ ప్రారంభించిన హంద్రీ-నీవా కాలువలో అడుగంటిన జలాలతో సమీపంలోని చిన్న కుంటలాంటి చెరువును నింపడానికే ఆపసోపాలు పడుతున్న వేళ, ప్రాజెక్టును ప్రారంభించేసినట్లు అధికార పార్టీ నేతలు చెప్పుకోవడం, కాదన్నవారిపై విమర్శలకు దిగడం చేస్తున్నారు.

జీడీనెల్లూరుకు మూడోసారి సమన్వయ కర్త మార్పు

టూచ్!

స్వామి కాదు కృపాలక్ష్మి



చిత్తూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు వైసీపీ సమన్వయకర్తను అధిష్ఠానం మళ్లీ మార్చింది. తాజాగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్థానంలో ఆయన కుమార్తె కృపాలక్ష్మి పేరును బుధవారం రాత్రి ప్రకటించింది. ఇలా మార్పు చేయడం ఇది మూడోసారి. జీడీనెల్లూరు నియోజకవర్గంలో నారాయణస్వామికి టికెట్ రాకుండా ఆయన వ్యతిరేకవర్గం గట్టిగా పనిచేసిన విషయం.. ఆయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామని చెప్పడం తెలిసిందే. దీంతో వైసీపీ అధిష్ఠానం తొలుత ఆయన్ను తప్పించింది. చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను జీడీనెల్లూరు అసెంబ్లీకి.. నారాయణస్వామిని చిత్తూరు లోక్‌సభకు సమన్వయకర్తలుగా ప్రకటించింది. దీంతో నారాయణస్వామి వర్గమంతా ఆయనకే టికెట్ ఇవ్వాలంటూ అన్ని మండలాల్లో ప్రెస్‌మీట్లు నిర్వహించారు. నారాయణస్వామి కూడా సీఎం జగన్‌ను కలిసి జీడీనెల్లూరు నుంచి పోటీ చేసే అవకాశం మరోసారి ఇవ్వాలని గట్టిగా ప్రయత్నించి సఫలమయ్యారు. దీంతో రెండోసారి నారాయణస్వామి, రెడ్డెప్పకు పాత స్థానాలనే అప్పగించారు. అలా సిట్టింగ్ ఎమ్మెల్యేనే ఇన్‌చార్జి అయ్యారు. ఈసారి డిప్యూటీ సీఎం మేనల్లుడు తెరపైకి వచ్చి వ్యతిరేకంగా తయారయ్యారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ, తాజా జాబితాలో జీడీనెల్లూరు సమన్వయకర్తగా కృపాలక్ష్మి పేరుంది. వాస్తవానికి చాలాకాలం ముందు నుంచే నారాయణస్వామి తనకు బదులుగా తన కుమార్తెకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఆమె కూడా పలు కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. ఆమెకే టికెట్ అనే ప్రచారం జరిగినా, నియోజకవర్గంలోని పరిణామాల నేపథ్యంలో రెడ్డెప్ప.. తర్వాత నారాయణస్వామి పేర్లు తెరపైకి వచ్చాయి.చివరకు తన కుమార్తెను సమన్వయకర్తగా నియమించుకోవడంలో నారాయణస్వామి సఫలమయ్యారు.

కుప్పం రైల్వే సమస్యలు తీర్చండి

● డివిజనల్ రైల్వే మేనేజర్‌కు చంద్రబాబు లేఖ

కుప్పం, ఫిబ్రవరి 28: కుప్పం నియోజకవర్గ పరిధిలోని రైల్వేస్టేషన్లలో సమస్యలను పరిష్కరించాలంటూ మాజీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు బుధవారం సౌత్ వెస్ట్రన్ రైల్వే బెంగళూరు డివిజన్ రైల్వే డివిజనల్ మేనేజరుకు లేఖ రాశారు. కుప్పం, మల్లానూరు, గుడుపల్లె రైల్వేస్టేషన్లలో కనీస సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. కుప్పం ఒక ట్రాన్సిట్ పాయింట్ అని తెలిపారు. ఏపీ, తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న మంచి మార్కెట్ ప్లేస్ అని, ఎడ్యుకేషన్ జోన్ అని గుర్తు చేశారు. పైన పేర్కొన్న రైల్వే స్టేషన్లలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుప్పం రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 8 గంటలకు అదనపు పుష్‌పుల్ రైలును కేటాయించాలని కోరారు. కుప్పం రైల్వేస్టేషన్‌కు ఇరువైపులనూ కలుపుతూ రైల్వేస్టేషన్‌పై స్కైవాక్ ఏర్పాటు చేయాలని, గుడుపల్లె రైల్వేస్టేషన్‌లో వెయిటింగ్ హాల్ నిర్మించాలని, ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికులు కూర్చోవడానికి సీట్లు ఏర్పాటు చేయాలని, ఇరువైపులా ప్రయాణికులకు షెల్టర్లు నిర్మించాలని, గుడుపల్లె, మల్లానూరు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు తాగునీటి వసతి కల్పించాలని ఆ లేఖలో చంద్రబాబు కోరారు.

రాగిపిండి కొంటే కిలో బియ్యం కట్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: రేషన్ షాపుల్లో మార్చి నుంచి నగదుకు రాగిపిండి పంపిణీ చేయనున్నారు. కిలో రాగిపిండిని రూ.11 చెల్లించి కొన్న కార్డుదారుకు ఉచిత బియ్యం కోటాలో కిలో కట్ చేస్తామని జేసీ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వున్న నిల్వమేర రాగులు, గోధుమ పిండి, చక్కెర, బియ్యం కార్డుదారులు పొందాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు, ఫిబ్రవరి 28: రానున్న ఎన్నికల నేపథ్యంలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ జాషువా బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు సీసీఎస్‌లో పనిచేస్తున్న టి.ప్రసాద్‌ను టూటౌన్‌కు, వీఆర్‌లో ఉన్న ఎస్.లోకేష్‌ను పెనుమూరుకు, గంగాధరనెల్లూరులోని బి. రామాంజనేయులును యాదమరికి, గంగవరంలో పనిచేస్తున్న యు.ప్రతాప్ రెడ్డిని చౌడేపల్లెకు, చిత్తూరు సీసీఎస్, ట్రాఫిక్‌లో పనిచేస్తున్న ఇ.బాబును వి.కోటకు, వీఆర్ ఉన్న వై.సుమన్‌ను నగరికి బదిలీ చేశారు. చిత్తూరు ట్రాఫిక్ నుంచి ఇ.జయప్పను డీఆర్సీబీకి, వీఆర్ నుంచి సి.వెంకటేశ్వర్లును డీటీసీకి, ఐరాల నుంచి యు.వెంకటేశ్వరును వెదురుకుప్పానికి, వెదురుకుప్పం నుంచి బి.రమేష్‌బాబును ఐరాలకు, కాణిపాకం ఎస్‌ఐ పి.శ్రీనివాసరావును గుడిపాలకు బదిలీ చేశారు. గుడిపాల ఎస్‌ఐ కె.రామ్మోహన్‌ను కాణిపాకానికి, వీఆర్‌లో ఉన్న కె.స్వర్ణతేజను డీసీఆర్బీకి, బి.సుబ్బారెడ్డిని డీటీసీకి, ఎం.రాజకుళ్లాయప్పను శ్రీరంగరాజపురానికి, కె.శాంతమ్మను దిశ మహిళా స్టేషన్‌కు, వన్‌టౌన్‌లో పనిచేస్తున్న బి.భారతిని చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన ఎస్‌ఐలు తమకు కేటాయించిన స్థానాల్లో రెండురోజుల్లో రిపోర్ట్ చేసుకోవాలని పేర్కొన్నారు.

● అలాగే, చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలు ఎం.కె. ప్రవీణ్ కుప్పానికి, జి.నాగేంద్ర కుమార్ చిత్తూరు వన్‌టౌన్‌కు, ఎ.వెంకటక్రిష్ణ కార్వేటినగరానికి, డి.శేషగిరి చిత్తూరు తాలుకాకు, ఎ.వెంకట నారాయణ నింద్రకు, ఎస్.వెంకటరాముడు విజయపురానికి, జి.రామచంద్రయ్య నగరికి, జి.ఇక్బాల్ చిత్తూరు టూటౌన్‌కు బదిలీ అయ్యారు.


చంద్రగిరి రాజకీయాలపై ప్రభావం!



● ఒంగోలు ఎంపీ వైసీపీ సమన్వయకర్తగా చెవిరెడ్డి

● సొంత నియోజకవర్గంపై తాజా నియామక ప్రభావమెంత!

తిరుపతి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి నియమితులయ్యారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో అక్కడి నుంచీ ఎంపీగా పోటీ చేయడం దాదాపు ఖరారైనట్టయింది. ఈ నియామకం చంద్రగిరి రాజకీయాలపై ప్రభావం చూపనుంది. చంద్రగిరి నుంచి ఆయన రాజకీయంగా ఒంగోలుకు వలస వెళ్ళాల్సి రావడం అధికార పార్టీ శ్రేణులకు నిస్పృహ కలిగిస్తుండగా, టీడీపీ శ్రేణుల్లో మరింత ధీమా పెంచుతోంది. చంద్రగిరి రాజకీయాల్లో చెవిరెడ్డి తనదైన ముద్ర వేశారు. పెళ్ళిళ్ళు, చావులు, అనారోగ్యాలు.. ఇలా సందర్భం ఏదైనా ఆయా ఇళ్ళకు వెళ్ళి సంబంధిత కుటుంబీకులను కలుస్తూ వ్యక్తిగత పరిచయాలు, సాన్నిహిత్యం పెంచుకునే ప్రయత్నం చేశారు. ఇక ఉత్సవాలు, జాతర్లకు ఎంత మారుమూల కుగ్రామానికైనా, ఆలయానికైనా తనే వెళ్ళి పాల్గొనేవారు. ఆయా వేడుకల నిర్వహణకు ఆర్థికంగానూ సాయం అందించేవారు. ఏటా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణతో యువతను ఆకట్టుకునేందుకు యత్నించారు. పండుగలకు, పబ్బాలకు కానుకల పంపిణీ, వినాయక చవితికి విగ్రహాల పంపిణీ...ఇలా తాయిలాలకూ పేరు మోశారు. కుటుంబ సభ్యులు ముగ్గురూ ఎంతగా చంద్రగిరి రాజకీయాల్లో మమేకమైనా నియోజకవర్గంలో వైసీపీ రాజకీయమంతా భాస్కర రెడ్డి కేంద్రంగానే నడుస్తోంది. ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డిని చంద్రగిరి వైసీపీ ఇంఛార్జిగా, రానున్న ఎన్నికలకు అభ్యర్థిగా ప్రకటించినా, తుడా ఛైర్మన్‌గా నియమించినా కూడా నేటికీ భాస్కరరెడ్డి ఛత్రఛాయలోనే మోహిత్ సైతం నడుస్తున్న పరిస్థితి. ఆయనకున్న విస్తృత పరిచయాలు, రాజకీయ వ్యూహాలూ నిస్సందేహంగా కుటుంబీకులకు లేవు. భాస్కరరెడ్డి ప్రత్యక్షంగా లేకుండా చంద్రగిరి ఎన్నికల సమరానికి వైసీపీ గానీ, ఆయన తనయుడు మోహిత్‌గానీ పూర్తి స్థాయిలో సంసిద్ధమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. భాస్కరరెడ్డి ఒంగోలులో పోటీ చేస్తే వనరులు, సొంత మనుషులు ఏదో ఒక స్థాయిలో చంద్రగిరి నుంచీ ఒంగోలుకు తరలక తప్పదు. అది చంద్రగిరిలో మోహిత్‌కు కష్టం, నష్టం కలిగించే అవకాశం ఉంటుంది. భాస్కర రెడ్డి రాజకీయ వ్యూహాలు, కార్యాచరణ గురించి స్పష్టంగా తెలిసిన టీడీపీ శ్రేణులు, నేతలు తాజా పరిణామంతో ఊరట పొందుతున్నారని చెప్పాలి. వైసీపీ పట్ల, ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వుందని, టీడీపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయని, చంద్రగిరిలో టీడీపీ గెలుపు ఖాయమని ఇప్పటికే బలంగా విశ్వసిస్తున్న స్థానిక టీడీపీ శ్రేణులకు వైసీపీ తాజా నియామకం మరింత ధీమాను పెంచింది. అధినేత జగన్‌కు అందుబాటులో వుండేందుకు భాస్కరరెడ్డి చంద్రగిరి బరి నుంచీ తప్పుకుని తాడేపల్లి చేరుకున్నప్పుడే టీడీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. తాజా నియామకంతో ఎన్నికల్లో ఆయన చంద్రగిరిలో ప్రత్యక్షంగా వుండలేని పరిస్థితి నెలకొంది. దానివల్ల పోల్ మేనేజ్‌మెంట్‌లో చంద్రగిరి వైసీపీ మునుపటి స్థాయిలో పనిచేసే పరిస్థితి లేదని టీడీపీ శ్రేణుల భావన. వైసీపీలో ఆ లోటు తమకు లాభిస్తుందనే అంచనాతో రెట్టించిన ఉత్సాహంతో వీరు పనిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తానికీ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన భాస్కర రెడ్డికి తాజా నియామకం రాజకీయంగా పదోన్నతి అని చెప్పాలి. అయితే అది అక్కడ ఎంపీగా గెలిస్తే. ఆయన రాజకీయ పదోన్నతి సంగతి ఎలా వున్నా సొంత నియోజకవర్గంలో కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోణంలో చూస్తే మాత్రం తాజా నియామకం ఆయన కుటుంబానికి ఎంతోకొంత కష్టాన్ని, నష్టాన్ని కలిగిస్తుందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల నుంచీ వినిపిస్తోంది.



బీసీల్లో పెరుగుతున్న ఆశలు.. అంచనాలు

● ప్రధాన పార్టీల టికెట్ల కోసం ముమ్మర ప్రయత్నాలు

తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో ప్రధాన రాజకీయ పార్టీల టికెట్లపై బీసీల్లో ఆశలు, అంచనాలు పెరుగుతున్నాయి. పలు స్థానాల్లో ఇటు వైసీపీ నుంచీ అటు టీడీపీ నుంచీ అసెంబ్లీ టికెట్ల కోసం బీసీ సామాజికవర్గాలకు చెందిన పలువురు ఆశావహులు రేసులో వున్నారు. హోరాహోరీగా తలపడుతున్న ప్రధాన రాజకీయ పార్టీలు మెజారిటీ ఓటర్లను ఆకట్టుకునేందుకు పోటాపోటీగా బీసీలకు అవకాశం కల్పించేందుకు యత్నిస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఈ పార్టీలు అనుసరిస్తున్న ధోరణిని గమనిస్తున్న ఆశావహులు తాజా పరిణామాలు తమకు మేలు చేస్తాయని భావిస్తున్నారు. దీంతో పలువురు టికెట్ రేసులో గట్టిగా నిలిచి తమ అదృష్టాలను పరీక్షించుకుంటున్నారు. తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లోని మొత్తం 17 స్థానాలకు గానూ తంబళ్ళపల్లి, పలమనేరు, కుప్పం, చంద్రగిరి, తిరుపతి, వెంకటగిరి నియోజకవర్గాల్లో టికెట్ల కోసం బీసీల నుంచీ డిమాండ్ వుండగా టీడీపీ తొలి అభ్యర్థుల జాబితాలో తంబళ్ళపల్లి టికెట్ ఇతరులకు కేటాయించడంతో అక్కడ అవకాశం లేకుండా పోయింది. మిగిలిన చోట్ల ఎందరు టికెట్ సాధిస్తారో, టికెట్ సాధించిన వారిలో ఎందరు గెలుపు సాధిస్తారో తెలియదు గానీ ఆయా నియోజకవర్గాల నుంచీ ఆయా పార్టీల అధిష్ఠానాలకు బీసీ సామాజికవర్గాల తరపున తమ గళాన్ని మాత్రం బలంగా విన్పించడంలో సఫలమవుతున్నారు.

తిరుపతి, ఆంధ్రజ్యోతి

కుప్పంలో భరత్ పోటీ ఖాయమే!

కుప్పం నియోజకవర్గంలో వైసీపీ తరపున ఎమ్మెల్సీ భరత్ పోటీ చేయడం ఖాయమనే చెప్పాలి. ఆయనకు టికెట్ ప్రకటన లాంఛనప్రాయమే. నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో వన్యకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన ప్రజలున్నారు. అదే వర్గానికి చెందిన భరత్ తండ్రి చంద్రమౌళికి వైసీపీ 2014, 2019 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు టికెట్ కేటాయించింది. గత ఎన్నికల తర్వాత అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుమారుడు భరత్‌ను నియోజకవర్గ ఇంచార్జిగా ప్రకటించి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టింది వైసీపీ. జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారాయన. వన్యకుల క్షత్రియులు అధికంగా వున్నందున ఆ వర్గాలతో పాటు ఇతర బీసీల ఓట్ల కోసమే వైసీపీ భరత్‌కు టికెట్ ఇవ్వనుంది. అయితే టీడీపీకి, వ్యక్తిగతంగా చంద్రబాబుకు కంచుకోట వంటి కుప్పంలో ఆయన ముందు ఏ సమీకరణలూ పనిచేసే పరిస్థితి లేదనే చెప్పాలి.

తిరుపతి రేసులో నరసింహ యాదవ్

తిరుపతిలో అధికంగా వున్న బీసీ కులాలు సాంప్రదాయకంగా టీడీపీ వెన్నంటి వున్నప్పటికీ పార్టీ ఆవిర్భావం నుంచీ ఇప్పటి వరకూ బీసీలకు ఇక్కడ అవకాశం దక్కలేదు. ఇదే నినాదంతో తుడా మాజీ ఛైర్మన్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ ఈసారైనా బీసీ కోటా కింద తనకు టికెట్ ఇవ్వాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. నగరంలోని అన్ని బీసీ కులాలకు చెందిన టీడీపీ మద్దతుదారులు ఇటీవల ఒకటి రెండు పర్యాయాలు ఆత్మీయ సమావేశాలు కూడా నిర్వహించి పార్టీ టికెట్ డిమాండ్ చేశారు. అయితే వీరి డిమాండ్ పార్టీ అధిష్ఠానానికి చేరాల్సినంత బలంగా చేరడం లేదు. దీంతో బీసీల టికెట్ డిమాండ్ తిరుపతి వరకే పరిమితమవుతోంది తప్ప అధిష్ఠానానికి చేరడం లేదు.

పలమనేరు టికెట్ కోసం ఇద్దరి పోటీ

పలమనేరు నియోజకవర్గం తొలుత ఎస్సీ రిజర్వుడు సెగ్మెంట్. పునర్విభజనతో 2009 నుంచీ జనరల్ స్థానంగా మారింది. తొలి ఎన్నికల్లో టీడీపీ తరపున, 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున అమరనాథరెడ్డి గెలిచారు. అయితే తగిన గుర్తింపు లేని కారణంగా వైసీపీని వీడి టీడీపీలో చేరి మంత్రి కూడా అయ్యారు. 2019లో టీడీపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు.ఆ ఎన్నికల్లో వైసీపీ బీసీ సామాజికవర్గంలో వక్కళిగ కులానికి చెందిన వెంకటే గౌడకు టికెట్ ఇవ్వగా ఆయన సంచలన విజయం సాధించారు. రానున్న ఎన్నికల్లో కూడా తనకే టికెట్ దక్కుతుందని ఆయన ధీమాగా వున్నప్పటికీ పోటీ మాత్రం తప్పడం లేదు. వక్కళిగ కులానికే చెందిన జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు కూడా టికెట్ రేసులో వున్నారు. వైసీపీలో ఇద్దరూ బీసీలే టికెట్ కోసం పోటీ పడుతున్నారు. అవకాశం ఎవరికి దక్కుతుందో వేచి చూడాల్సి వుంది. గత ఎన్నికల్లో వైసీపీ మీద సానుభూతి పవనాలు వీచడంతో సులువుగా గెలిచినప్పటికీ రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి అమరనాథ రెడ్డిని ఢీకొనడం ఈ ఇద్దరిలో ఎవరికైనా అంత సులువైతే కాదు.



పుంగనూరులో రామచంద్ర యాదవ్ ఒంటరిపోరు

పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ తరపున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోటీ చేయడం ఖాయం. అలాగే టీడీపీ టికెట్ చల్లా రామచంద్రారెడ్డికీ ఖాయమైంది. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప టీడీపీ అభ్యర్థి మారే అవకాశం లేదు. ఇక గత ఎన్నికల్లో జనసేన నుంచీ పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించి జనం దృష్టిని ఆకర్షించిన రామచంద్ర యాదవ్ వ్యక్తిగతంగానే మంత్రి పెద్దిరెడ్డిపై పోరాడి జనంలో క్రేజ్ సంపాదించుకున్నారు. అయితే ఆయన జనసేన లేదా టీడీపీ అదీ కాకుంటే కనీసం బీజేపీలో చేరివున్నా ఉమ్మడి అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో బలంగా ప్రభావం చూపేవారు. అలా కాకుండా సొంతంగా రాజకీయ పార్టీ పెట్టడంతో ఆయన ప్రభావం తగ్గిందనే చెప్పాలి. రానున్న ఎన్నికల్లో అసలు ఆయన పుంగనూరు నుంచీ పోటీ చేస్తారో లేదో కూడా తెలియడం లేదు. అయితే ఇంత కాలం మంత్రి పెద్దిరెడ్డిపై పోరాడిన కారణంగా వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేస్తారని పుంగనూరు నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా వున్న బీసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వారి అంచనాలు ఏమవుతాయో వేచి చూడాల్సివుంది.

చంద్రగిరిలో బడి సుధా యాదవ్

చంద్రగిరికి సంబంధించి బీసీ నేత బడి సుధా యాదవ్ టీడీపీ టికెట్ ఆశిస్తున్నారు. తొలుత కాంగ్రెస్‌లో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి అనుచరుడిగా వున్న ఇతడు 2014లో ఆమె వెంట టీడీపీలో చేరారు. అరుణకుమారి రాజకీయాల నుంచీ తప్పుకోవడంతో చంద్రగిరి పగ్గాలు పులివర్తి నానీ చేతికి వచ్చాయి. స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన కారణంగా పులివర్తి నానీతో ఇమడలేక 2019 ఎన్నికల తర్వాత వైసీపీలో చేరారు. పంచాయతీ ఎన్నికల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డితో వ్యతిరేకించి తిరుగుబాటు అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచుగా గెలిచారు. అప్పటి నుంచీ వైసీపీకి దూరంగా వున్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ టికెట్ కోసం గల్లా అరుణకుమారి కుటుంబం ద్వారా యత్నించారు. అయితే అప్పటికే పులివర్తి నానీ నియోజకవర్గంలో పాతుకుపోయి వుండడం, ఆయనను గెలిపించాలని సాక్షాత్తూ టీడీపీ యువనేత నారా లోకేశ్ చంద్రగిరి ప్రజలకు బహిరంగంగా పిలుపునిచ్చిన నేపథ్యంలో అక్కడ టికెట్ నానీకి తప్ప ఇతరులకు ఇచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో జనసేన తరపున చంద్రగిరి లేదా తిరుపతి నుంచీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కోసం యత్నిస్తున్నట్టు సమాచారం. అవకాశాల సంగతెలా వున్నా చంద్రగిరి నియోజకవర్గంలో బీసీ స్వరం వినిపించిన తొలి నాయకుడిగా సుధా యాదవ్ గుర్తింపు దక్కించుకున్నారు.

వెంకటగిరి టికెట్ కోసం మస్తాన్ యత్నాలు

వెంకటగిరి నియోజకవర్గంలో ఇంచార్జిగా కమ్మ సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వున్నారు. రామకృష్ణతో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా వెంకటగిరి టీడీపీ టికెట్ రేసులో వున్నారు. వీరి సంగతి పక్కన పెడితే ఈ నియోజకవర్గం నుంచీ ఈ పర్యాయం బీసీ వర్గాల నుంచీ మస్తాన్ యాదవ్ రేసులో నిలిచారు. పలువురు ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఈయన వారి ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబుపై ఒత్తిడి తెప్పిస్తున్నట్టు సమాచారం. అవకాశమిస్తే ఎన్నికల్లో ఎంత ఖర్చయినా భరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడంతో పాటు తనకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచేందుకు పలువురు ప్రముఖులు సిద్ధంగా వున్నారని అధినేతకు నివేదించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాదు కేంద్రంగా ఆయన టికెట్ కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇద్దరు బలమైన ఆశావహుల నడుమ మస్తాన్ యాదవ్ చేస్తున్న ప్రయత్నం ఎంతవరకూ సఫలీకృతమవుతుందో తెలియదు కానీ నియోజకవర్గం నుంచీ టికెట్ కోసం బీసీ గళాన్ని మాత్రం ఆయన గట్టిగానే వినిపిస్తున్నారు.

తంబళ్ళపల్లిలో శంకర్ స్వయంకృతాపరాధం

2014లో టీడీపీ ఇచ్చిన అవకాశంతో గుళ్ళోళ్ళ శంకర్ యాదవ్ తంబళ్ళపల్లె నియోజకవర్గ తొలి బీసీ ఎమ్మెల్యేగా గెలిచి చరిత్ర సృష్టించారు. 2019 ఎన్నికల్లో కూడా టీడీపీ అవకాశమిచ్చినా ఓడిపోయారు. రానున్న ఎన్నికల్లో తిరిగి పోటీ చేసేందుకు గట్టిగా యత్నించారు. బీసీ కోటాలో ఆయనకు తప్పనిసరిగా మూడవ పర్యాయం కూడా అవకాశం దక్కుతుందని బీసీ వర్గాలు ఆశపెట్టుకున్నాయి. అయితే ఈసారి టికెట్ రెడ్డి సామాజికవర్గానికి చెందిన జయచంద్రారెడ్డికి కేటాయించారు. దీనికి శంకర్ యాదవే కారణమని, చేజేతులారా ఈ పరిస్థితిని కొని తెచ్చుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నివాసం, వ్యాపారాలు బెంగళూరులో వుండడంతో అడపాదడపా మాత్రమే శంకర్ నియోజకవర్గానికి రాకపోకలు సాగిస్తూ వచ్చారు. దీనిపై శ్రేణుల్లో అసంతృప్తిని పసిగట్టిన అధిష్ఠానం పలుమార్లు ఆయన్ను తీరు మార్చుకోవాలని, ఎక్కువ సమయం జనం మధ్యే గడపాలని హెచ్చరించింది. ఆరు నెలలు గడువు కూడా ఇచ్చింది. అయినా ఆయన తీరు మారలేదని, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో అధిష్ఠానం ప్రత్యామ్నాయం వైపు ఆలోచించి నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో రెండు సార్లు అవకాశమిచ్చిన టీడీపీ అధిష్ఠానం బీసీలకు ప్రాధాన్యత ఇచ్చిందని, అయితే దాన్ని నిలుపుకోకుండా శంకర్ నియోజకవర్గానికి దూరమైనందువల్లే బీసీలకు అవకాశం లేకుండా పోయిందని బీసీ వర్గాలు ఆయనపై గుర్రుగా వున్నట్టు సమాచారం.

రామాపురం వద్ద చిరుత!

పూతలపట్టు, ఫిబ్రవరి 28: పూతలపట్టు మండలం రామాపురం అటవీ ప్రాంతంలో చిరుత సంచారాన్ని రైతులు గుర్తించారు. మద్దిలయ్య గారిపల్లె, రామాపురం గ్రామాల మధ్య అటవీప్రాంతంలో చుట్టుపక్కల గ్రామాల వారు పశువులను మేపుకొంటూ ఉంటారు. ఇలా అవులు మేపుకొంటున్న ఓ రైతు బుధవారం మధ్యాహ్నం చిరుతను చూసి కేకలు వేస్తూ గ్రామంలోకి పరుగు తీశారు. గ్రామస్తులు ఆ ప్రాంతానికి వచ్చి చూడగా చిరుత జాడలేదు. వీరి సమాచారంతో అటవీశాఖ అధికారులు వచ్చి చిరుత పాదముద్రలను గుర్తించి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించి వెళ్లారు.

కర్ణాటక మద్యంతో పట్టుబడిన సర్పంచి



పలమనేరు, ఫిబ్రవరి 28: కారులో కర్ణాటక మద్యం తరలిస్తూ బంగారుపాళ్యం మండలం గొల్లపల్లి సర్పంచ్ ప్రకాష్‌నాయుడు పట్టుబడినట్లు పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. పలమనేరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐలు శివశంకర్, సహదేవి కేటీల్‌ఫారం ఫ్లైఓవర్ వద్ద గతరాత్రి వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. సర్పంచి కారును నిలిపి తనిఖీ చేయగా 864 బాటిళ్ల కర్ణాటక మద్యం, 384 టెట్రా ప్యాకెట్లు గుర్తించారన్నారు. సర్పంచిని అరెస్టుచేసి మద్యం, కారు సీజ్ చేశామని తెలిపారు. పట్టుబడిన సర్పంచిపై ఇప్పటికే బంగారుపాళ్యం పోలీసుస్టేషన్‌లో నాలుగు, అలిపిరి, మదనపల్లె టూటౌన్‌లో ఒక్కోటి చొప్పున ఆరు క్రిమినల్ కేసులు ఉన్నట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు.

రెండో రోజు టెట్‌కు 871 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్),ఫిబ్రవరి 28:రెండో రోజైన బుధవారం జరిగిన టెట్‌కు జిల్లాలోని మూడు, చెన్నైలోని ఒక సెంటర్‌లో నిర్వహించిన పరీక్షలకు 871 మంది హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు. మొత్తం 994 మంది అభ్యర్థులకు గాను 871 మంది హాజరు కాగా, 123 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేస్తారా?

● 190 రామాపురం సీఎంసీ వద్ద అడ్డుకున్న రైతులు

గుడిపాల, ఫిబ్రవరి 28: గుడిపాల మండలం 190 రామాపురం సీఎంసీ వద్ద భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించకుండానే అధికారులు పనులు చేపట్టారు. దీంతో బుధవారం 190 రామాపురం దళితవాడకు చెందిన 20 కుటుంబాల వారు పనులను అడ్డుకున్నారు. సర్వే నెం.114లో 15.1 ఎకరాలకు రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించకపోవడంతో కోర్టును ఆశ్రయించామన్నారు. ఈ విషయం తేలేదాకా ఎవరూ భూమిలోకి వెళ్ళరాదని చెప్పినా సీఎంసీ అధికారులు కల్వర్టును ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. దళిత వాడవాసులు, సీఎంసీ అధికారుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి రెండు వర్గాలకు సర్దిచెప్పి, మీ రికార్డులను తీసుకువస్తే పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

ఓట్ల లెక్కింపు కేంద్రంగా ఎస్వీసెట్ కళాశాల

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: త్వరలో జరగబోవు ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు కేంద్రంగా చిత్తూరులోని శ్రీవేంకటేశ్వర ఇంజనీరింగ్ (ఎస్వీసెట్) కళాశాలను ఎంపిక చేసినట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నామినేషన్ల స్వీకరణకు వారం రోజుల ముందు వరకు ఓటర్ల నమోదుప్రక్రియకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, పార్టీల ప్రతినిధులు సురేంద్ర కుమార్(టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు(బీజేపీ), పరదేశి(కాంగ్రెస్), గంగరాజు (సీపీఎం), ఉదయ్‌కుమార్ (వైసీపీ), వినాయక (ఆమ్‌ఆద్మీ పార్టీ), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పేద ఖైదీలను ఆదుకునేందుకు కమిటీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 28: బెయిల్ లభించకుండా, జరిమానా చెల్లించేందుకు డబ్బుల్లేకుండా జైల్లో ఉంటున్న పేదఖైదీలకు ఆర్థిక చేయూతనిచ్చి ఆదుకునే దిశగా జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కమిటీకి ఛైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా జైళ్ల సూపరింటెండెంట్, సభ్యులుగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ఎస్పీ, జిల్లా జడ్జిచే నామినేట్ చేసే ఇన్‌చార్జి జడ్జి ఉంటారు. జైల్లో వున్న పేద ఖైదీల కేసును బట్టి బెయిల్ పొందేందుకు లేదా, జరిమానా చెల్లించేందుకు ఈ కమిటీ సిఫార్సు మేరకు నిధులను నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో మంజూరు చేస్తుంది. అవసరమైతే నోడల్ అధికారిని నియమించుకోవడానికి అనుమతిచ్చింది.

సీఎం సభానంతరం ఇలా..





ప్రైవేటు లే అవుట్‌లో తొలగించిన కూసాలు - విరిగిన కూసాలు



సభాస్థలి వద్ద పేరుకుపోయిన చెత్త

కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 28: శాంతిపురం మండలం మఠం వద్ద సీఎం జగన్ సభ ముగిసి మూడు రోజులైంది. అనంతర దృశ్యమే స్థానికులకు ఖేదాన్ని మిగిల్చింది. బసవేశ్వరస్వామి, డీకేటీ భూములు కలిసిన సుమారు ఏడెకరాల స్థలంలో సభ నిర్వహించారు. దానికి అటు కిలోమీటరు, ఇటు కిలోమీటరు దూరంలో మఠం, గుండిశెట్టిపల్లె పరిసరాల్లో రోడ్డుకు రెండువైపులాఆ వాహనాలకు పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. సభ నిర్వహించిన ప్రాంతంలో టెంట్లను బుధవారం తొలగించారు. కానీ, ఈ ప్రాంతమంతా పడిన చెత్తాచెదారాన్ని అలాగే వదిలేశారు. పార్టీ జెండాలు, ప్లకార్డులు, తాగిపారేసిన నీళ్ల, మజ్జిగ ప్యాకెట్లతో దారుణంగా ఉంది. ఇక, పార్కింగ్‌కోసం గుండిశెట్టిపల్లె వద్ద ఓ ప్రైవేటు లే అవుట్‌లో నాటిన కూసాలను తొలగించి, విరగ్గొట్టి విధ్వంసం సృష్టించారు. అడ్డుకోబోయిన లే అవుట్ యజమానికి తిరిగి కూసాలు నాటిస్తామంటూ హామీ ఇచ్చారు. అలాగే హెలిప్యాడ్ ఏర్పాటు చేసిన ఎంకే.పురం వద్ద కూడా ప్రైవేటు లే అవుట్‌లో కూసాలు తొలగించినా, బుధవారం దాకా నాటినవారు లేరు. నేలమీద పడి, విరిగిన కూసాలే కనిపిస్తున్నాయి. మిగిలిన పార్కింగ్ స్థలాల్లోనూ చెత్తాచెదారం పోగు పడింది.

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

● స్వర్ణరథంపై విహరించిన వినాయకుడు






ఆలయ ఆస్థాన మండపంలో సంకటహర గణపతి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు - స్వర్ణ రథంపై విహరిస్తున్న వరసిద్ధుడు

ఐరాల (కాణిపాకం) ఫిబ్రవరి 28: కాణిపాక ఆలయంలోని ఆస్థాన మండపంలో బుధవారం ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా సంకటహర గణపతి వ్రతాన్ని భక్తులు నిర్వహించారు. పౌర్ణమి గడచిన నాలుగవ రోజున ఈ వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవర్లను స్వర్ణరథంపై ఉంచి మాడవీధులలో ఊరేగించారు. మాజీ ఉపరాష్ట్రపతి కుమార్తె దీపావెంకట్, ఈవో వెంకటేశు, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, రాయలసీమ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ రీజినల్ ఛైర్‌పర్సన్ శైలజాచరణ్‌రెడ్డి, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్థానికుడని టికెట్ అడిగితే అవమానిస్తున్నారు

● చనిపోతానంటూ వైసీపీ దళిత నేత డేవిడ్ వీడియో

కేవీబీపురం, ఫిబ్రవరి 28: సత్యవేడు వైసీపీ టికెట్ ఆశించిన కేవీబీపురం మాజీ జడ్పీటీసీ డేవిడ్ మనస్తాపం చెందారు.టికెట్ అడిగినందుకు తనను అయినవారే ఎగతాళి చేస్తున్నారంటూ బాధపడుతూ ఆత్మహత్య చేసుకుంటున్నానని సామాజిక మాధ్యమాల్లో ఒక వీడియో పోస్టు చేశారు. అది వైరల్ కావడంతో డేవిడ్ కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.సత్యవేడు టికెట్ ప్రతిసారీ బయటివారికి కేటాయించి స్థానికులను నిరాశ పరుస్తున్నా రనేది డేవిడ్ వాదన. ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని,ఎంపీ మిధున్ రెడ్డిని కలిసిన డేవిడ్ స్థానికుడిగా తనకు సత్యవేడులో పోటీచేసే అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయం తెలిసి స్థానికంగా కొంతమంది నాయకులు నీ స్థాయికి ఎమ్మెల్యే టికెట్ కావాలా అంటూ తనను అవహేళన చేస్తూ మాట్లాడుతుండడంతో మనస్తాపం చెంది తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.డేవిడ్ కుటుంబసభ్యులు ఆందోళనతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఆయన ఇంటి వద్దకెళ్ళిపరిశీలించారు. అయినా డేవిడ్ ఆచూకీ దొరకలేదు.పోలీసులు ఫోను లోకేషన్‌ను ట్రేస్ చేయడానికి ప్రయత్నించగా అది స్విచ్‌ఆఫ్‌లో ఉంది.



పురుగు మందు డబ్బాతో డేవిడ్

సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి


సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

పుంగనూరు, ఫిబ్రవరి28: సమాజంలో సైబర్‌నేరాలు తీవ్రమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు వాటిపై జాగ్రత్తగా ఉండాలని పుంగనూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ సూచించారు. బుధవారం కాలేజీ ఆవరణలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ మేనేజర్ షాహీద్ మాట్లాడుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులు సెల్‌ఫోన్లకు మెసేజ్ చేసి వాటిని ఓపెన్ చేయగానే బ్యాంక్‌ఖాతాలోని డబ్బులు మాయం అవుతున్నట్లు తెలిపారు. కాబట్టి సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయరాదని సూచించారు. మోసం జరిగిన వెంటనే 1930 నెంబరుకు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సివుందన్నారు. సమావేశంలో అధ్యాపకులు శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మార్కెట్ యార్డు సేవలు



సోమల, ఫిబ్రవరి 28: సోమల మార్కెట్ యార్డు సేవలను రైతులకు అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం సోమలలో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన మార్కెట్ యార్డును, సోమల బస్టాండ్‌లో రూ. 37 లక్షలతో నిర్మించిన ఆర్టీసీ ప్రయాణీకుల ప్రాంగణాన్ని మంత్రి ప్రారంభించారు. నెల్లిమంద, కామిరెడ్డివారిపల్లెలో సచివాలయ భవనాలను, పేటూరు, నెల్లిమందల్లో నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్లు, కందూరులో రూ. 51 లక్షలతో నిర్మించిన షాదీ మహల్, ఎగువపల్లె, పొదలగుంటపల్లె, నగిరిండ్లు, కూకటి గొల్లపల్లెలో ఆర్వో ప్లాంట్లను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, ఎంపీపీ ఈశ్వరయ్య, జడ్పీటీసీ కుసుమ, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఏఎంసీ చైర్‌పర్సన్ అరుణ, సింగిల్ విండో చైర్మన్ డాక్టర్ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికే తొలి ప్రాధాన్యత

సదుం, ఫిబ్రవరి 28: ప్రజా సంక్షేమానికే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత నిస్తోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. సదుం మండలంలో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. తిమ్మానాయనపల్లె, తాటిగుంటపాళెం, జోగివారిపల్లెల్లో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన సబ్-స్టేషన్‌లను, సదుంలో నిర్మించిన దోబీ ఘాట్, షాదీ మహల్, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలు, బస్ షెల్టర్స్, ఆర్వో ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డప్ప, జడ్పీ సీఈవో గ్లోరియా, బీసీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి, పీఆర్ ఈఈ చంద్రశేఖర్, నాయకులు పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, శివారెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మైనారిటీ నాయకులు అంజాద్, సయ్యద్, ఖాజాపీర్, కమురుద్దీన్, మస్తాన్, మహమ్మద్ అలీ, ఇమ్రాన్, ఇర్ఫాన్, ఇందాద్, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లూరు చర్చిలో పాస్టర్ల సామూహిక ప్రార్థనలు



కల్లూరు, ఫిబ్రవరి 28: పులిచెర్ల మండలం కల్లూరు బీసీ కాలనీలోని క్రైస్ట్ చర్చిలో పాస్టర్ ధనరాజ్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. భారతదేశం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని పాస్టర్లు ధనరాజ్, సాంసంగ్ జార్జ్, ప్రతాప్, మోషే తెలిపారు. దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధి వైపు అడుగులు వేయాలని, వ్యాపార రంగం ఆదాయంవైపు పయనించాలన్నారు. రాజకీయ నాయకులు దేశాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ఈ మేరకు సామూహిక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు. పాస్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

కొలమాసనపల్లెలో రంకేసిన కోడెగిత్తలు



పలమనేరు, ఫిబ్రవరి28 : పలమనేరు మండలం కొలమాసనపల్లెలో బుధవారం గ్రామస్తులు మైలేరు పండుగను వైభవంగా నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న కోడెగిత్తలకు 75 బహుమతులు అందజేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇందులో మొదటి 7 బహుమతులు వరుసగా రూ. 70,000, 50,000, 35,000, 20,000, 15,000 12,000, 10,000 గాను, అటుపిమ్మట 8,9,10,11,12 బహుమతులు వరుసగా రూ. 9, 8, 7, 6, 5వేలు గాను, తదుపరి కోడెగిత్తలకు రూ. 4నుంచి 2వేల వరకు బహుమతులు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ పండుగలో కొలమాసనపల్లె గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాది మంది ఈ పోటీలను తిలకించేందుకు తరలి వచ్చారు.

మహిళా చైతన్యం టీడీపీ చలువే


రామకుప్పంలో మహిళా గృహసారథుల సమావేశం

రామకుప్పం, ఫిబ్రవరి 28: టీడీపీ ఆవిర్భావంతోనే రాష్ట్రంలో మహిళల్లో చైతన్యం వచ్చిందని ఆ పార్టీ రామకుప్పం పంచాయతీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విజయ్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, తెలుగుమహిళ రామకుప్పం మండల అధ్యక్షురాలు పద్మమ్మ, సీనియర్ నేత అలివేలు మంగమ్మ తెలిపారు. పట్టణంలోని కాశీవిశ్వేశ్వరాలయం వద్ద బుధవారం సాయంత్రం 71, 72. 73 బూత్‌లకు సంబంధించి మహిళా గృహసారధుల ఎంపిక సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో మహిళలకు అన్నిరంగాల్లో అన్యాయం జరిగిందన్నారు. మహిళా అభ్యున్నతే లక్ష్యంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను మహిళా గృహసారథులు ఇంటింటా వివరించి, రానున్న ఎన్నికల్లో టీడీపీకే ఓటేసేలా చూడాలని వారు కోరారు. సమావేశంలో సుబ్రి, దయానంద, ఆదిల్, సతీష్, మంజునాథ్, నరసింహులు, అమర్‌నాథ్, శంకర్, గోవిందప్ప, ఎంపీ నాగరాజు, రమేష్, మురళి, నీలమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

ఎన్నికల వేళ గ్రామాలపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

గంగవరం, ఫిబ్రవరి 28 : ఎన్నికలు దగ్గర పడుతుండడంతో పోలీసులు గ్రామాల్లో పర్యటించి అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ మహేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం గంగవరం సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో పలమనేరు సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశముండడంతో, సీఐలు, ఎస్ఐలు వారి పరిధిలోని గ్రామాల్లో పర్యటించి పరిస్థితులపై ఆరా తీయాలన్నారు. కర్ణాటక, తమిళనాడు సరిహద్దులలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి అప్రమత్తంగా ఉండాలన్నారు. గొడవలకు పాల్పడే వారెవరైనా ముందుగా బైండోవర్ చేసుకొని వారి మూమెంట్‌లను తనిఖీ చేస్తూ ఉండాలన్నారు.

నేడు చెరువుల వేలం పాటలు

సోమల: అన్నెమ్మగారిపల్లె పంచాయతీలోని చెరువులకు గురువారం వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి తెలిపారు. ఎగువచెరువు, నాగమ్మచెరువు, దోనమాకులచెరువు, గడ్డమానుఒడ్డులో చేపల పెంపకానికి ఆసక్తి గల వారు సచివాలయంలో జరిగే వేలంలో పాల్గొనాలన్నారు.

చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలి


వరదరాజపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

కుప్పం రూరల్, ఫిబ్రవరి 28: చంద్రబాబును లక్ష మెజారిటీతో గెలిపించాలని టీడీపీ వన్నెకుల క్షత్రియ నియోజకవర్గ యువత అధ్యక్షుడు డి.సతీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రామమూర్తి కోరారు. బుధవారం వారు మల్లానూరు పంచాయతీ వరదరాజపురంలో పార్టీ తరఫున ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ రాజశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి దామోదరన్, వన్నెకుల క్షత్రియ యువత కార్య నిర్వాహక కార్యదర్శి సుభాష్, రమేశ్, విభూషణ్, సురేశ్, గణేశ్‌కుమార్, వినోద్‌కుమార్, గణపతి పాల్గొన్నారు.

రామకుప్పం : రామకుప్పం మండలం వీర్నమలపెద్దతాండా, గుట్టూరుతాండా, చిక్కపల్లెతాండా, సింగసముద్రం, కెంచనబల్ల గ్రామాల్లో బుధవారం టీడీపీ గ్రామ వికాస సమావేశాలు నిర్వహించారు. చంద్రబాబు పీఏ మనోహర్, ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం మాట్లాడుతూ రాష్ట్రంలో అట్టడుగు వర్గాలు అభివృద్ధి పథంలో పయనించాలంటే రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టీడీపీని ఆదరించాలన్నారు. ఆయా సమావేశాల్లో నేతలు జేయి, రాజ.కుమార్‌నాయక్, మునీంద్రానాయక్, గౌడానాయక్, దేవానాయక్, శివాజీనాయక్, సుబ్రహ్మణ్యం, సత్తి, వేలు, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణప్ప, బాలకృష్ణ, రమేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, రామలింగారెడ్డి, నాగభూషణం, జయశంకర్ తదిదరులు పాల్గొన్నారు. అలాగే కెంచనబల్ల పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరనాగపురం, కెంచనబల్లలకు చెందిన వైసీపీ నేతలు రమేష్, చలపతి, ముబారక్‌బాషాలకు టీడీపీ నాయకులు ఆనందరెడ్డి, నరసింహులు తదితరులు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసీపీ పాలనలో పేదవాళ్ళు బతకడం కష్టం

వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో రాష్ట్రంలో ప్రజలు బతకలేని పరిస్థితులు దాపురించాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజులఖాదర్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన రామకుప్పం మండలం కెంచనబల్లలో మాజీ సీఎం చంద్రబాబుకు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ కుప్పం నియోకవర్గంలో చంద్రబాబు చేసిన అభివృద్ధి తప్ప, వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నేతలు సలాంసాబ్, అన్సర్, ఆదిల్, మతీన్, చాంద్‌బాషా, నిసార్‌అహ్మద్, నేతలు జయశంకర్, సత్తి, జేయి పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, ఫిబ్రవరి 28 : రైతు భరోసాలో రైతులను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన శాంతిపురంలో విలేకర్లతో మాట్లాడుతూ రైతు భరోసా పథకం ద్వారా ఒక్కో రైతుకు ఐదేళ్లలో రూ. 67,500 ఇస్తామని చెప్పి కేవలం రూ.37,500 ఇచ్చి రూ.30,000 ఎగనామం పెట్టారని విమర్శించారు. అదే టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు రైతు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా సుమారు రూ.21 వేల కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో 64 లక్షల మందికి రైతు భరోసా ఇస్తామని చెప్పి కేవలం 50 లక్షల మంది రైతులకు మాత్రమే ఇచ్చి మిగిలిన రైతుల కడుపు కొట్టారని ఆరోపించారు. ఎన్నికల ముందు జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలను తుంగులోకి తొక్కారన్నారు. ఆక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి మాట తప్పరన్నారు. ఆక్వా, నాన్ ఆక్వా జోన్‌గా విడదీసి యూనిట్ విద్యుత్ చార్జీ రూ.5.85 వరకు పెంచి వసులు చేస్తూ ఆక్వారంగాన్నే దెబ్బతీశారన్నారు. పాడి రైతులకు లీటర్ పాలకు రూ. 4లు బోనస్ ఇస్తామని హామీ ఏమైందని ప్రశ్నించారు. ధాన్యం రైతులను వైసీపీ దళారులు దోచుకున్నారని విమర్శించారు. ఒక్కో బస్తాకు రూ.300 నుంచి రూ.500 వరకు రైతులు నష్టపోయారన్నారు. ఐదేళ్లలో 10 సార్లకుపైగా ప్రకృతి విపత్తులకు 60 లక్షల ఎకరాలలో పంట దెబ్బ తిని రూ.30వేల కోట్లు రైతులు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ కింద కేవలం రెండు వేలకోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు.

విద్యార్థుల మేధోశక్తిని గుర్తించడానికే సైన్స్ ఫేర్


సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి28: విద్యార్థుల్లో దాగి వున్న మేధోశక్తిని బయటకు తీయడానికే ప్రభుత్వం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి కార్తీక్ పేర్కొన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రయోగాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్ ఫేర్ నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యంతోపాటు జ్ఞానం పెరుగుతుందన్నారు. పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాల్లో సైన్స్ ఫేర్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు భాష్యం, రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి, నారాయణ పాఠశాలల్లో సైన్స్ ఫేర్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి


కందూరులో విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన, విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో శిద్దరామయ్య

కల్లూరు, ఫిబ్రవరి 28: ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలని ఎంఈవో శిద్దరామయ్య తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి, మంగళంపేట, పులిచెర్ల, కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుదవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఆర్‌సీ పరిధిలోని విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ పాఠశాల హెచ్‌ఎంలు హరిశంకర్, మంజువాణి, శ్రీవాణి, సయ్యద్ సాహెబ్‌వలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిపురం : కుతేగానిపల్లె పరమహంస యోగానంద విద్యాలయంలో బుధవారం నేషనల్ సైన్స్‌డే నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. వాటిని తిలకించిన ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జాతీయ సైన్స్‌డే పురస్కరించుకుని విద్యార్థులు పలువురు శాస్త్రవేత్తల వేషధారణలో అలరించారు.

సోమల : మండలంలోని సీఆర్పీ పరిధిలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్‌ను ఎంఈవో శివరత్న ప్రారంభించారు. కందూరు, సోమల, నంజంపేట, పెద్దఉప్పరపల్లెలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగరాజ, వెంకట్రమణారెడ్డి, కుసుమాంబ, పగడాల లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

వి.కోట : విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు విద్యార్థులు అనునిత్యం ప్రయోగాలతో ముందుకు వెళ్ళాలని ఎంఈవో చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాని నిర్వహించారు. ఖాజీపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను అధికారులతో కలసి ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఉత్తమ ప్రతిభకు ప్రశంసలతో పాటు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నాయకులు పీ.ఎస్.నాగరాజ్, వైస్ ఎంపీపీ డా.తమీంఖాన్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగవరం : గంగవరం హైస్కూల్‌లో సైన్స్ డే జరిగింది. ఎంఈవోలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సైన్స్‌పై పట్టుసాధించి మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవలు అందించాలన్నారు. ఎంవీఆర్ డిగ్రీకళాశాలలో యువ సైంటిస్ట్ పవన్ మాట్లాడుతూ సైన్స్‌తోపాటు మన సొంత తెలివితేటలతో ఎన్నోరకాల ప్రయోగాలు చేసి సమాజానికి అంకితమివ్వవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఆర్ కళాశాల కరస్పాండెంట్ వెంకటరమణారెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ, ప్రమోద్‌కుమార్, కిషోర్ పాల్గొన్నారు.

పలమనేరు : విద్యార్థులు తయారుచేసే ప్రయోగాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని పలమనేరు ఎంఈవో లీలారాణి పేర్కొన్నారు. బుధవారం సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంగరగుంటలో విద్యార్థులు ప్రదర్శించిన శ్రీహరికోట రాకెట్ నమూనాలు, వాతావరణంతో పాటు పలు ప్రయోగాలను ప్రదర్శించారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని ఆదరించండి

మాజీ మంత్రి అమరనాథరెడ్డి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 28 : రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని ఆదరించాలని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి కోరారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం బైరెడ్డిపల్లె పట్టణంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనపై ప్రజలు విసిగిపోయారని, రాబోవు ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అభివృద్ధిని విస్మరించి రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. ఎక్కడచూసినా ఇసుక మాఫియా, భూకబ్జాలు, అవినీతి, అక్రమాలు పేట్రేగి పోయాయని ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతోవుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్ గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, నాయకులు షౌకత్ అలి, అమరనాథ రెడ్డి, మంజునాథరెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌గౌడు, భువనచంద్ర గౌడు, అరుణ్ గౌడు, గౌరప్ప, రాజేష్, హరికుమార్, కృష్ణమూర్తి, మధు, సాదత్, మురళి, సుబ్రమణ్యం, జనసేన నాయకులు పసుపులేటి దిలీప్, చైతన్యకుమార్, సల్మాన్ పాల్గొన్నారు.

టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, ఫిబ్రవరి 28: రామకుప్పం మండలం 89పెద్దూరు పంచాయతీ ఆరిమానిపెంటకు చెందిన టీడీపీ కార్యకర్త రాణెమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ 89పెద్దూరు యూనిట్ ఇన్‌చార్జి గజేంద్ర, నేతలు నరసింహులు, యువరాజు, కదిరప్ప, బాబు తదితరులు రాణెమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులకు వారు పార్టీ తరఫున రూ.10వేలు అందజేశారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన



చౌడేపల్లె, ఫిబ్రవరి 28 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో లక్ష కుంకుమార్చన ఘనంగా ప్రారంభమైంది. బుధవారం అమ్మవారికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. కొండపై ఉన్న డార్మిటరీ హాల్‌లో అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి, కలశస్థాపన చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారి వెండి ప్రతిమకు ఉభయదారులచే లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం గణపతి, ఆదిత్య, నవగ్రహ, చండీహోమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఉభయదారులకు తీర్థప్రసాదాలను ఆలయ చైర్మన్ నాగరాజ రెడ్డి, ఈవో చంద్రమౌళి అందజేశారు.

ద్రావిడ వర్సిటీ శ్రీనివాస వనానికి నిప్పు



గుడుపల్లె, ఫిబ్రవరి 28: ద్రావిడ విశ్వవిద్యాలయం శ్రీనివాస వనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో బుధవారం మధ్యాహ్నం మంటలు వ్యాపించి వనంలోని చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. విశ్వవిద్యాలయ సిబ్బంది మంటలు వ్యాపించకుండా నీటి ట్యాంకర్ల తీసుకొచ్చి ఆపే ప్రయత్నం చేశారు. అయితే కొంత వరకు మంటలను అదుపుచేసినా ఆ తరువాత మంటలను అదుపు కాలేదు. సుమారు 10 ఎకరాల్లో కొంత మేరకు ఎండిన చెట్లు దగ్ధం అయ్యాయి.

గౌరీ లింగేశ్వర స్వామి కల్యాణం



సోమల, ఫిబ్రవరి 28: సోమల మండలం నంజంపేట సమీప గార్గేయ నదీ తీరంలోని గౌరీ లింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి నంది వాహనంపై అధిష్ఠింపజేసి వేద మంత్రాల నడుమ కల్యాణం జరిపారు. నంజంపేట, పొదలగుంటపల్లె, కమ్మపల్లె, గట్టువారిపల్లె, వడ్డిపల్లె, తుగడంవారిపల్లె గ్రామాల భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

సర్పంచుకు మంత్రి పరామర్శ

సోమల, ఫిబ్రవరి 28: నంజంపేట సర్పంచు వెంకటరెడ్డి ఇటీవల ద్విచక్రవాహనంలో వెళుతూ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలిసిన మంత్రి పెద్దిరెడ్డి సర్పంచును పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి వెంట మాజీ ఎంపీపీ ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ ఈశ్వరయ్య, రవీంద్రారెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు ఉన్నారు.

మామిడితోటకు నిప్పు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి28: చదళ్ల గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు మామిడితోటకు నిప్పు పెట్టినట్లు పుంగనూరు అగ్నిమాపకాధికారి సుబ్బరాజు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం చదళ్లకు చెందిన చౌడప్ప మామిడితోటకు నిప్పు పెట్టినట్లు సమాచారం రావడంతో మంటలను అదుపు చేసినట్లు ఆయన తెలిపారు. తోటకు నిప్పు పెట్టడం వల్ల దాదాపు రూ. 50వేలు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

16న లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 28: మార్చి 16న పుంగనూరు కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో రాజీకి అనువైన క్రిమినల్, సివిల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, పోలీసులు అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని ఆయన కోరారు.

టైలర్స్‌కు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


గోకుల్ సర్కిల్‌లో అన్నదానం చేస్తున్న టైలర్లు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి28: అర్హత కలిగిన టైలర్స్‌కు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం టైలర్స్ డే సందర్భంగా గోకుల్ సర్కిల్‌లో వారు పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టైలర్స్ సంఘ నాయకులు మాట్లాడుతూ పట్టణంలో టైలర్స్‌కు కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని, బ్యాంకుల ద్వారా రుణ సహాయం అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఖాసీమ్, సురేంద్ర, నరసింహులు, రవికుమార్, మంజుల, అమ్మజాన్, గురుమూర్తి, ఇస్లాంబాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

కుప్పం, ఫిబ్రవరి 28: కుప్పంలో బుధవారం టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రదర్శనగా వచ్చి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఏ.ఆరిఫ్, ఎస్.బషీర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ



రామకుప్పం, ఫిబ్రవరి 28: రామకుప్పం మండలంలో టైలర్ల సంఘం వారు టైలర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ముద్దనపల్లె, వీర్నమల ఉన్నతపాఠశాలల్లో పదోతరగతి చదివే విద్యార్థులకు పరీక్ష సామగ్రిని విరతణగా ఇచ్చారు. వాటిని సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు బాబులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మహ్మద్, కోశాధికారి నరేష్, సీనియర్ టైలర్లు గంట్లరెడ్డి, అక్బర్, కుప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు వి.కోటలో టీడీపీ నేతల పర్యటన

వి.కోట, ఫిబ్రవరి 28: వి.కోట పట్టణంలో గురువారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్ తెలిపారు. ఈశ్వర్ నగర్, జైభీంనగర్, మసీదువీధి, సత్యసాయినగర్ ప్రాంతాల్లో జరిగే బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి పాల్గొంటారని, కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయలని పిలుపునిచ్చారు.

కల్లూరును కమ్మేసిన పొగమంచు



కల్లూరు, ఫిబ్రవరి 28: కల్లూరును బుధవారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 8గంటలవుతున్నా పొగమంచు వీడకపోవడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు. లైట్ల వెలుతురులో వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి. కొద్దిరోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా ఉదయం మాత్రం మంచు కురుస్తోంది.

లోకేశ్ పాల్గొనే సభాస్థలికి భూమి పూజ



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 28: ఎస్ఆర్‌పురం మండలంలో మార్చి నెల మొదటి వారంలో టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ పర్యటన సందర్భంగా నిర్వహించే సభాస్థలి కోసం మండలంలోని క్షీరసముద్రం గ్రామ సమీపంలో స్థల పరిశీలన చేసి, బుధవారం టీడీపీ నాయకులు భూమి చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, ఆనంద నాయుడు, నరసింహారెడ్డి, హేమాద్రి యాదవ్, కుమార్, జల్లా వెంకటేష్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, సోమేశ్వర్‌రెడ్డి, భూపతిరెడ్డి, జలంధర్ నాయుడు, భాస్కర్ నాయుడు, జనసేన నాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రద్దు చేసిన సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తాం: భానుప్రకాష్



బాబు ష్యూరిటీ కరపత్రాలను పంచుతున్న భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 27 సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తామని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి పట్టణ పరిధిలోని సత్రవాడ దళితవాడలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరారు. మహిళలు ఆయనకు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, కార్యదర్శి శ్రీనివాసన్, మదివాసన్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ మొండి బకాయిలను వసూలు చేయండి



మాట్లాడుతున్న రెవెన్యూ సీజీఎం ధర్మజ్ఞాని

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 28: జిల్లాలో పేరుకుపోయిన విద్యుత్ మొండి బకాయిలను యుద్ధప్రాతిపదికన వసూలు చేయాలని ఆ శాఖ రెవెన్యూ సీజీఎం ధర్మజ్ఞాని ఈఈ, డీఈలను ఆదేశించారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులో ఉన్న అర్బన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా చిత్తూరు రూరల్, అర్బన్ డివిజన్లు కలిపి రూ.42 కోట్ల మేర వసూలు చేయాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి నెల రెండు రోజులు ముందే ముగియనుండటంతో ఈ వసూలును వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కలిసి రూ.73 కోట్ల మేర మొండి బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. నెలల తరబడి వర్క్‌ఆర్డర్లు పూర్తి చేయకుండా కొంత మంది ఏఈలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మార్చి నెలలోపు వర్క్‌ఆర్డర్లను పూర్తి చేయకుంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏస్ఏవో శ్రీనివాసులు, ఈఈలు పద్మనాభపిళ్లై, హరి, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఏఏవో గీత, జేఏవో గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు జమ



రైతులకు మెగా చెక్‌ను అందజేస్తున్న జేసీ, ప్రజాప్రతినిధులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 28: రైతుల బ్యాంకు వ్యక్తిగత ఖాతాల్లోకి రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు జమచేసినట్లు జేసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి నుంచి వర్చువల్‌గా సీఎం కార్యక్రమాన్ని ప్రారంభించగా, జిల్లా కలెక్టరేట్ నుంచి జేసీతో పాటు ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. రైతు భరోసాతో పాటు 2021-22 రబీ, ఖరీఫ్‌కు సంబంధించి సున్నా వడ్డీ పంట రుణాల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమచేశారు. ఐదో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం కింద ఈ ఏడాది మూడో విడతగా జిల్లాలోని 2,31,197 మంది రైతుల ఖాతాల్లో రూ.46.31 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల కింద 26,961 మంది రైతుల ఖాతాల్లో రూ.7.5 కోట్లు మొత్తాలను జమచేశారు. అనంతరం రైతులకు మెగా చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మేయర్ అముద, జడ్పీ వైస్ చైర్మన్ రమ్య, స్త్రీ శిశు సంక్షేమ జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ భారతి, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీఏ పీడీ తులసి తదితరులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 28: మహిళలు ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని డీఆర్‌డీఏ పీడీ తులసి పేర్కొన్నారు. ఆర్‌బీఐ సూచనల మేరకు మహిళలు, యువత, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన అవగాహన సదస్సు బుధవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కొనసాగింది. మేక్ ఏ రైట్ స్టార్ట్‌బికం ఫైనాన్షియల్లీ స్మార్ట్ అనే నినాదంతో మహిళలు, యువత, విద్యార్థులకు లీడ్ బ్యాంకు మేనేజర్ హరీష్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలని, అందుకు అవసరమైన ఆర్థిక ప్రోత్సాహకం బ్యాంకుల ద్వారా కల్పించగా, డీఆర్‌డీఏ ద్వారా పరిశ్రమలు, ఇతర ఏర్పాటుకు వీలుందన్నారు. కార్యక్రమంలో పలు బ్రాంచ్‌ల బ్యాంకు మేనేజర్లు, మహిళలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించండి

పాలసముద్రం, ఫిబ్రవరి 28: మండలంలో వున్న చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ మోహన్ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య కేంద్రం నుంచి పాలసముద్రం బీసీ కాలనీ వరకు పోలియో చుక్కలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం 0-5 సంవత్సరాల పిల్లలందరికీ ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల వద్ద పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల్లో విద్యుత్ ఆదాపై అవగాహన సదస్సు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 28: స్థానిక మ్యాంగో భవన్‌లో బుధవారం పరిశ్రమల్లో విద్యుత్ ఆదాపై అపిట్కో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపిట్కో ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల్లో నూతన మోటర్లు, టెక్నాలజీలను ఉపయోగించి విద్యుత్‌ను ఆదా చేయాలన్నారు. అలాగే ఎంత వరకు విద్యుత్ మోటర్లను ఉపయోగించాలి, కెపాసిటర్లు ఎంత సామర్థ్యం వరకు పరిశ్రమలలో ఉపయోగించి నాణ్యమైన విద్యుత్‌ను అన్ని మోటర్లకు ఎలా సరఫరా చేయాలనే విషయాలను వివరించారు. గురువారం జిల్లాలోని పరిశ్రమలను పరిశీలించి, విద్యుత్ ఎలా ఆదా చేయాలనే విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం ఇవ్వండి

● చంద్రబాబును కలిసిన రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి



గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 28: చిత్తూరు పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసే అవకాశం ఇవ్వాలని గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డిపల్లెకు చెందిన ప్రధానమంత్రుల మాజీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, రిటైర్డ్ ఎస్పీ పి.చిన్నస్వామి కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం టీడీపీ అధినేత చంద్రబాబును రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చంద్రబాబు వద్ద తన మనసులోని మాటగా రానున్న ఎన్నికల్లో చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా పోటీచేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరగా, ఆయన ఈ విషయంపై సానుకూలంగా స్పందించి తప్పకుండా అవకాశం కల్పించనున్నట్లు హామీ ఇచ్చారని చిన్నస్వామి పేర్కొన్నారు.

మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



తవణంపల్లె, ఫిబ్రవరి 28: మండల కేంద్రమైన తవణంపల్లెలో వెలసిన కాలభైరవేశ్వర స్వామి ఆలయంలో మార్చి 8న నిర్వహించనున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను బుధవారం గ్రామస్తులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి, ఆహ్వాన పత్రికలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డెప్ప, తులసీరాం, వినాయక, మణి, మునస్వామి, కమలనాథ్, మహేష్, కుమార్ చౌదరి, పూజారి సుబ్రహ్మణ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌కు బీజేపీ కృషి

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 28: వికసిత్ భారత్‌కు బీజేపీ కృషి చేస్తోందని స్టేట్ ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు చిట్టిబాబు పేర్కొన్నారు. బుధవారం సంతపేటలో ప్రజాపోరులో భాగంగా బీజేపీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను స్థానికులకు వివరించారు. 2024లో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామభద్ర, బ్రహ్మానందరెడ్డి, కరుణాకర్ సిద్ధు, మస్తాన్, కుమారస్వామి, భువనేశ్వరి పాల్గొన్నారు.

దేశ సంక్షేమం బీజేపీతోనే సాధ్యం



కరపత్రాలను అందిస్తున్న బీజేపీ నాయకులు

నింద్ర, ఫిబ్రవరి 28: దేశ ప్రజల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని మండల పార్టీ అధ్యక్షులు కడియాల బాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కావునూరు, శ్రీరామపురం, కొప్పేడు, వేదాంతపురం ఎస్టీ కాలనీ, ఐఆర్ కండ్రిగ, ఎంఎస్‌టీ పురం, ఎస్టీకాలనీ, ఎలకాటూరు, మేళంబాకం, కొత్తాఆరూరు, పాత ఆరూరు, కచ్చిర్వేడు గ్రామలలో ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి వెళ్లి బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను అందించి, వివరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్‌ప్రసాద్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు భువనేశ్వరి, హరిబాబు, వేణు, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని వరిగిపల్లి గ్రామంలో ఓటు హక్కుపై అపోలో కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బుధవారం ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఓటుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ షఫీ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకుని, వినియోగించుకోవాలని పేర్కొన్నారు. మెరుగైన సమాజం కోసం ఓటు హక్కును వినియోగించడం చాలా అవసరమన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రానీయొద్దు

పాలసముద్రం, ఫిబ్రవరి 28: మండలంలోని 13 పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో చేతిపంపులు, బోరు మోటార్లు సక్రమంగా పనిచేసేటట్లు చూడాలన్నారు. తాగునీటి సమస్య ఏదైనా గ్రామంలో ఏర్పడితే అత్యవసరంగా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న డీఎస్పీ, సీఐ

నగరి, ఫిబ్రవరి 28: సమాజంలో రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో మెలగి ఆదర్శంగా నిలవాలంటూ నగరి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ సురేష్ సూచించారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని హెచ్చరించారు. ఏడాదికోసారి రౌడీషీటర్లను బైండోవర్ చేసుకోవడం జరుగుతుందని, అలాగే ఎన్నికలు సమీపిస్తున్నందున ఎన్నికల వేళ ఎలా మెలగాలో వారికి సూచించినట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు.

ఆదరించి.. గెలిపించండి

● నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా: గురజాల జగన్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 28 : 'నన్ను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించండి.. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా'నని చిత్తూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినందుకు అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, అచ్చెన్నాయుడుతో పాటు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో అందరూ సమష్టిగా కృషిచేసి పార్టీకి భారీ విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ పార్టీ గెలుపుకోసం అందరూ కలసి పనిచేయాలని, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని అన్నారు. ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత ఉందని, అదే సమయంలో టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేసే మ్యానిఫెస్టోను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని పేర్కొన్నారు. నేతలు, కార్యకర్తలు ఎలాంటి మనస్పర్థలు లేకుండా అందరూ కలసికట్టుగా పనిచేసి గురజాల జగన్మోహన్‌ను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, పార్టీ చిత్తూరు నియోజకవర్గ పరిశీలకుడు మునిరామయ్య, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్, కటారి హేమలత, కాజూరు బాలాజీ, సీఆర్ రాజన్, కోదండయాదవ్, త్యాగరాజన్, వసంత్ కుమార్, సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడమే

వైసీపీ ప్రభుత్వ హయాంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమని చిత్తూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ హయాంలో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు రూ.450 కోట్లతో 87 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కాగా మిగిలిన 13 శాతం పనులను కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయలేకపోయిందని విమర్శించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గేటు ఒక్కరోజు గడవకముందే తొలగించడం దారుణమన్నారు. సీఎం జగన్ పాలనలో కుప్పం అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైసీపీ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టడానికి అనేక తప్పుడు కార్యక్రమాలకు తెరతీస్తోందని ఆరోపించారు.

పాఠశాలల్లో ఘనంగా జాతీయ సైన్స్‌డే



చిత్తూరు హార్వర్డ్ స్కూల్లో, బృందావన్ స్కూల్లో, విజయం స్కూల్లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు - వెదురుకుప్పంలో వైజ్ఞానిక ప్రదర్శనను చూస్తున్న డీఈవో

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 28: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయం సీబీఎస్ఈ పాఠశాలల్లో ఆ విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి అధ్యక్షతన విద్యార్థులు పలు నమూనాలు ప్రదర్శించారు. సంతపేటలోని బృందావన్ పాఠశాలలో కరస్పాండెంట్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ అధ్యక్షతన, స్థానిక రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ స్కూల్లో కరస్పాండెంట్ భాస్కర్ అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు వారి నైపుణ్యంతో తయారు చేసిన పలు నమూనాలు ప్రదర్శించారు. పలువురు న్యాయ నిర్ణేతలు ప్రదర్శనల వివరణను విద్యార్థుల నుంచి తెలుసుకుని వారి ప్రతిభ, నమూనా తయారీ ఆధారంగా పలు నమూనాలను ఎంపిక చేశారు. గెలుపొందిన వారికి పాఠశాలల యాజమాన్యాలు బహుమతులు అందజేయగా, ప్రతి ఒక్కరికి ప్రశంసాపత్రాలు అందించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో మేధో వికాసం: డీఈవో

వెదురుకుప్పం: పోటీతత్వం మేధో వికాసానికి దోహదం చేస్తోందని, అప్పుడే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని డీఈవో దేవరాజు అన్నారు. బుధవారం వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన సైన్స్ మేళాను ఆయన ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ పరిశోధనలతోనే వైజ్ఞానిక ప్రగతి మెరుగుపడుతుందని, పరిశోధనలపై విద్యార్థులకు ఆసక్తిని పెంచడం ఉపాధ్యాయుల కర్తవ్యమని తెలియజేశారు. అనంతరం పాఠశాలలోని పలు రికార్డులను డీఈవో పరిశీలించారు. అదేవిధంగా వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఇండియన్ బ్యాంకు మేనేజరు నాగరాజు వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు కరస్పాండెంట్ గుణశేఖర్ బహుమతులు అందజేశారు.

యాదమరి: మండలంలోని సీఆర్‌సీ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలను పరిశీలించి, విజేతలను ఎంపిక చేశారు. ఇందులో ప్రాథమిక పాఠశాల స్థాయిలో మొదటి బహుమతిగా శిరిశ్రీ(పెరుమాళ్లపెంట), ద్వితీయ బహుమతిగా రుతిక(మార్లబండ), తృతీయ బహుమతిగా రోషిత(లగడపాటూరు)లు పొందినట్లు ప్రిన్సిపాల్ లలిత తెలిపారు. సైన్స్ టీచర్లు భాస్కరరెడ్డి, నరసింహారెడ్డి, వాణి, భారతి, సుధాకర్, మహేష్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలసముద్రం: పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తమ ప్రయోగాల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి, ఉపాధ్యాయులు ధనరాజ్, నరసింహులు మండడి, సువర్ణ, వెంకటేశులు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురం: మండలంలోని పన్నూరు, జీఎం పురం, విజయపురం, శ్రీహరిపురం, జంబాడ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవోలు ఆంజనేయులు, హరిబాబు, ప్రధానోపాధ్యాయులు జానకిరామరెడ్డి, సోమశేఖర్, శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డీఎం పురం హైస్కూల్‌లో సైన్స్‌డే అక్షరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయులు రెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి బాలసుబ్రమణ్యం ఆచారి, కెమిస్ట్రీ విభాగాధిపతి హరిబాబు, అధ్యాపకులు సుబ్బారావు, సీఎన్.లత, కార్తీక్, జోగి ప్రసాద్, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే డీఎం పురం జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కేశవులు ఆధ్వర్యంలో, కేఎం పురం జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం సునీత ఆధ్వర్యంలో సైన్స్‌డేని ఘనంగా నిర్వహించారు.

నింద్ర: నింద్ర జడ్పీహైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ మేళాను స్థానిక ఎంపీపీ దీప ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాలను ఆమె పరిశీలించారు. ఉత్తమ సైన్స్ ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఎంఈవో వసుమతి, శ్రీధర్‌రాజు, హెచ్ఎంశివయ్య, ఉపాధ్యాయులు సురేష్, షరిఫ్, ఢిల్లీబాబు, గోపీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఆంధ్రకు ప్రత్యేకహోదా

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధ్యమవుతుందని నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ నారాయణస్వామి, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ నరసింహులు అన్నారు. గంగాధరనెల్లూరులో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో అధికారంలో కొనసాగినా ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. మార్చి 1వ తేదీన తిరుపతిలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఇతర కాంగ్రెస్ నేతలు హాజరుకానున్న బహిరంగసభకు నియోజకవర్గంలోని నేతలు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఓబీసీ కార్యదర్శి బండ్ల సుబ్బరాయులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రబాబు, ఉపాధ్యక్షుడు కన్నన్, పలు మండలాల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వాసు, హమేష్, పుష్పరాజ్, తులసిమణి, నేతలు జయచంద్ర, నాదమునిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: పుల్లూరు క్రాస్ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసింహులు మాట్లాడుతూ తిరుపతిలో జరగబోవు చలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని మండల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్య ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నగరంలో టైలర్ల ర్యాలీ



కార్యక్రమంలో పాల్గొన్న టైలర్ల సంఘం నేతలు

చిత్తూరు, ఫిబ్రవరి 28: అంతర్జాతీయ టైలర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని టైలర్లు నగరంలోని గాంధీ విగ్రహం నుంచి చర్చివీధి మీదుగా దర్గా సర్కిల్, గిరింపేటలోని దుర్గమ్మ ఆలయం వరకు బుధవారం ర్యాలీ నిర్వహించి, ఆలయ ఆవరణలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టైలర్ల సంఘ అధ్యక్షులు చంద్ర, సెక్రటరిలు చంద్రమౌళి, చిన్నమరెడ్డి, చిత్తూరు ఇన్‌చార్జి మార్కొండయ్య, సంఘ నేతలు నందకుమార్, వాసు, నీడిల్ ఆర్ట్ టైలర్ రాము, పలువురు టైలర్లు పాల్గొన్నారు.

నగరి: నగరిలో ఓంశక్తి దేవాలయం నుంచి టవర్‌క్లాక్ వరకు టైలర్లు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం టైలర్లందరూ సమష్టిగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అయూబ్ బాషా, ఉపాధ్యక్షులు ఉమాపతి, సభ్యులందరూ కలసి 1989 నుంచే టైలర్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని టైలర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, జనార్ధన్, శ్రీనివాసులు, నాగూర్, ధనరాజ్, శేఖర్, మణిరత్నం పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను తనిఖీ చేసిన కమిషనర్

చిత్తూరు, ఫిబ్రవరి 28: నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ అరుణ బుధవారం తనిఖీ చేశారు. 31, 32 వార్డు సచివాలయాల పరిధిలో గురుబేకరి వీధి, వినాయకగుడి వీధి, ఆర్కాడువీధి, గంగా క్రాస్, కావేరి క్రాస్ వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. కార్మికుల హాజరు నమోదు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. వ్యర్థాలను సెగ్రిగేషన్ చేయడంపై పారిశుధ్య కార్మికులతో పాటు, గృహస్థులకు అవగాహన కల్పించాలన్నారు.



చిత్తూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు బుధవారం ఆయన స్వగృహంలో పూలబొకే అందజేసి అభినందనలు తెలుపుతున్న జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా టీడీపీ ప్రధానకార్యదర్శి కోదండయాదవ్ తదితరులు

లక్ష్మీనారాయణస్వామి ఆలయ ట్రస్టీ కన్నుమూత



కె.ఎస్.శ్రీధర్ (ఫైల్‌ఫొటో)

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 28: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి ట్రస్టీగా వ్యవహరిస్తున్న తిరుపతికి చెందిన ప్రముఖ న్యాయవాది కె.ఎస్.శ్రీధర్ (81) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం కన్నుమూశారు. శ్రీధర్ మరణవార్త తెలుసుకున్న వేపంజేరి గ్రామ ప్రజలు, ఆలయ సిబ్బంది, భక్తులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. యుఎస్‌ఏలో కుమారుడు-కోడలు, కుమార్తె-అల్లుడు ఉన్నందున వారు శుక్రవారం వస్తున్నట్లు సమాచారం రావడంతో అదేరోజు తిరుపతిలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మరో కుమారుడు అడ్వకేట్ వాసు పేర్కొన్నారు. వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి శ్రీధర్ విశేషంగా కృషి చేశారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

పూతలపట్టు, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లో బుధవారం పోటుకనుమ టీడీపీ మాజీ ఎంపీటీసీ కవిత నాగరాజు సుమారు 300 మందికి భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, నాయకులు ఊట్ల నాగరాజు నాయుడు, దాము, హేమాద్రి, వీరభద్రయ్య, హేమాద్రి నాయుడు, ఏకాంబరం, సుబ్బరాజులు, భాస్కర్, హరి తదితరులు పాల్గొన్నారు.


బంగారుపాళ్యంలో...

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 28: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద వున్న అన్నక్యాంటీన్‌లో బుధవారం సదకుప్పం గ్రామానికి చెందిన మార్కొండనాయుడు మనుమడు ఎన్. ఢిల్లీప్రసాద్ జన్మదినం సందర్భంగా భోజనం వితరణ చేశారు. నాయకులు రాధాక్రిష్ణమ నాయుడు, సుదర్శన్ నాయుడు, రమేష్, శ్రీనివాసులు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

214వ రోజు...

గుడిపాల, ఫిబ్రవరి 28: మండలంలోని అన్నక్యాంటీన్‌లో బుధవారం 214వ రోజు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన శివగంగ బిల్డర్స్ యజమాని లంకిపల్లె రవి నాయుడు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ప్రతాప్ నాయుడు, రవి నాయుడు, టీడీపీ నాయకులు నాగరాజ యాదవ్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, శరత్, రామ్మూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరసిద్ధుడి కల్యాణం



వరసిద్ధుడి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చక, పండితులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 28: స్వయంభు కాణిపాక వరసిద్ధుడి కల్యాణాన్ని బుధవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెంలోని శ్రీబలుసులమ్మ ఆలయంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహింపజేశారు. ముందుగా సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి యజ్ఞోపవీతాన్ని ధరింపచేశారు. అనంతరం స్వామి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామికి ముత్యాల తలంబ్రాలు పోశారు.వందలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొట్టు సత్యనారాయణ, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ప్రచారరథ ఇన్‌చార్జి విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.